క్లుప్తంగా

మేజర్ కాలువలో గుర్రపుడెక్క తొలగింపు



ఫిరంగిపురం: మండల పరిధిలోని సాగర్ కాలువ గుర్రపు డెక్కను డీసీ 13 చైర్మన్ నల్లజర్ల రవికుమార్ చొరవతో పొక్లెయిన్ ద్వారా శనివారం తొలగించారు. పనులను చైర్మన్ ప్రారంభించారు. మేడికొండూరు డీసీ పరిధిలోని 39ఆర్ చిరుమామిళ్ల మేజర్ 39బీఎల్ మైనర్ కాలువ కింద బేతపూడి, వేమవరం, 113 తాళ్లూరు, కంద్రిక, నుదురుపాడు వరకు ఆరు కిలోమీటర్ల వరకు గుర్రపు డెక్కతో ఆయకట్టు రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సుందరరావు, అప్పయ్య, చెక్కా హనుమంతురావు, అంచుల శంకరరావు, వెంకటేశ్వర్లు, ఐదు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ నోట్‌పుస్తకాల ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి తన నివాసంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ శనివారం నోట్ పుస్తకాలను ఆవిష్కరించారు. మంగళగిరి 11వ వార్డు టీడీపీ నాయకుడు అవ్వారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తకాలను పట్టణ, రూరల్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు జంజనం సత్యనారాయణ, పంచల నరేష్, తిరువీధుల ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

సంక్రాంతి క్రీడా పోటీలు ప్రారంభం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా దోస్త్ ఓపెన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆటలు, మహిళలకు ముగ్గుల పోటీలను ఎస్ఐ వెంకటరవి ప్రారంభించారు. సాంప్రదాయబద్ధంగా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒకేషనల్ టూర్



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఒకేషనల్ టూర్ నిర్వహించారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ సందర్శనకు తీసుకెళ్లారు. ఒకేషనల్ టీచర్ ఝాన్సీ మాట్లాడుతూ హెచ్ఎం కె.ఆంటోని రాజు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఇతర విషయాలను వర్సిటీ యాజమాన్యం వివరించిందని చెప్పారు. ఒకేషనల్ టీచర్ సరోజ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బోధనపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల తల్లిదండ్రులకు చిన్నారులకు ఎటువంటి ఆటలు నేర్పిస్తున్నారు, పాతాల బోధనపై వివరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటలతో పాటు పాటలు, పద్యాలు, గేయాలు నేర్పిస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, ఆయాలు పాల్గొన్నారు.

సంఖ్య జ్ఞానంపై శిక్షణ

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని ఐసీడీఎస్ పరిధిలోని పలు గ్రామాల్లో చిన్నారులకు శనివారం ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ వెంకటేశ్వరమ్మ 5వ వార్డు అంగన్‌వాడీ సెంటర్లో చిన్నారులకు సంఖ్యా జ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఇ.సామ్రాజ్యం, ఆయా షేక్.షర్మిల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

9 ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తాడికొండ: తుళ్లూరు నదీ పరివాహక ప్రాంతంలో ఇసుకను తరలిస్తున్న 9 ట్రాక్టర్లను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అధిక లోడుతో వెళ్తున్న కారణంగా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి కేసులు నమోదు చేయలేదని, అనుమతి పత్రాలు, ఓవర్ లోడ్‌పై రెవెన్యూ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

వ్యాపారుల గుప్పిట్లో గిట్టుబాటు ధర

- పంట చేతికొచ్చే సమయానికి పడిపోతున్న ధరలు
- మద్దతు ధర కల్పనలో చేతులెత్తేసిన ప్రభుత్వం
- దూరంగా, భారంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- తేమశాతం అస్త్రంగా ధరలు తగ్గిస్తున్న దళారులు
- విక్రయాల అనంతరం ధాన్యం ధరలకు రెక్కలు



వరి రైతు పరిస్థితి మరీ దయనీయం. దిగుబడి రాక ముందు దాదాపు రూ.1,900 పలికిన ధాన్యం బస్తా(75కేజీలు)ధర నూర్పిడిలు అయ్యాక రూ.1,300కు పడిపోయింది. దీంతో ఏమీ పాలుపోని స్థితికి రైతులు వెళ్లిపోయారు.

ధర లేక కల్లాల్లో ఆరబోసిన ధాన్యం

తాడికొండ: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధర లేక అన్నదాతలు విలవిల్లాడిపోతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వ్యాపారుల గుప్పెట్లోకి ధరల నిర్ణయం వెళ్లిపోయింది. దీంతో పంట కోతకొచ్చే సమయానికి గిట్టుబాటు ధర రైతు చేజారిపోతోంది. వ్యవసాయ ఖర్చులు రావడం లేదని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉదాసీనతా వైఖరి దళారులకు, వ్యాపారులకు వరంగా మారింది. ధరల కట్టడిలో కూటమి సర్కార్ పూర్తిగా చేతులెత్తేసింది. ప్రయివేటుకు పచ్చ జెండా ఊపడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డుల్లో కొనుగోలు చేయాల్సిన పత్తి..మిల్లర్ల చెంతకు చేరడంతో.. అక్రమాలకు అంతులేకుండా పోయింది. అసలే నిరక్ష్యరాస్యత, ఆపై ఆంక్షల కత్తి అన్నదాత మెడకు ఉరితాడుగా మారిందనే విమర్శలు ఎక్కువయ్యాయి.

వ్యాపారుల మాయాజాలం

సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయాలి. ప్రస్తుతం వీటిని ఎక్కడో దూరంగా ఉన్న మిల్లుల్లో ఏర్పాటు చేశారు. అక్కడికి పత్తి తరలించాలంటే క్వింటాకు రూ.300 వరకు అదనంగా రైతుకు ఖర్చు అవుతోంది. ఇందుకు అదనంగా తేమశాతం పేరుతో బయ్యర్లు పెడుతున్న ఆంక్షలతో పత్తి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వ్యాపారులతో రాజ్యం నడుస్తోంది. అధికారులు ఈ–క్రాప్ నమోదులో కూడా వారికే పూర్తి సహకారం అందిస్తున్నారు.



పత్తి క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,300గా ప్రకటించింది. కానీ, మార్కెట్లో రైతుల నుంచి రూ.6 వేల నుంచి రూ.6,500కు మాత్రమే దళారులు కొనుగోలు చేస్తున్నారు.



నిన్న మొన్నటి వరకు రూ.10 వేలకు పైగా క్వింటా మినుము పలికింది. సరిగ్గా రైతుల చేతికి పంట అందే సమయానికి ఆంక్షల పేరుతో రూ.7,600కు దళారులు తెగ్గొట్టేశారు. దీంతో అపరాల రైతుల ఆవేదన అంతాఇంతా కాదు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రైవేటు మాఫియాని ప్రభుత్వ అరికట్టాలి. రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి. గతంతో పోల్చితే సాగు పెట్టుబడి రెండింతలు పెరిగింది. కానీ, ధరలు మాత్రం పెరగ లేదు. వ్యాపారులు కుమ్మక్కై.. రైతుల నుంచి సరుకు కొనుగోలు చేసిన తర్వాత ధరలు విపరీతంగా పెంచుతున్నారు.

– పరుచూరి నారాయణ, రైతు, పాములపాడు

ప్రభుత్వం పూర్తిగా విఫలం



రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఏర్పాటు చేయలేదు. ఈ క్రాప్ బుకింగ్ ను సకాలంలో నమోదు చేయకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రైవేటు వ్యాపారులకు కళ్లెం వేసి, రైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలి.

– చింతల భాస్కరరావు, రైతు సంఘం నాయకుడు

పాలకుల నిర్లక్ష్యానికి కార్మికులు బలి కావాల్సిందేనా?



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై గత 32 సంవత్సరాలుగా పాలక పక్షాలు చూపుతున్న నిర్లక్ష్యానికి కార్మికులు బలి అవ్వాల్సిందేనా.. అని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, మద్దతు తెలిపారు. 171 మంది కార్మికులు అనారోగ్యాలకు గురై మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. దీక్ష శిబిరంలో ఎం.శారద, బి.నవనీతం, వి.లక్ష్మి, డి.రమాదేవి, శివకుమారి, సూర్యప్రకాష్, అంకయ్య, ఆశీర్వాదం, సాంబయ్య, ఆరిఫ్, ఇస్మాయిల్, ఎం.గురవయ్య, వై.సుబ్బారావు, రమాదేవి, సారమ్మ, సామ్రాజ్యం, శివనాగలక్ష్మి పాల్గొన్నారు.

మందుబాబులపై కేసు నమోదు

తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. దొండపాడు సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఓపెన్ డ్రింకింగ్ చేస్తుండగా ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మూగ జీవాలను రక్షించుకోవాలి

డీజీఈ డాక్టర్ రామ్ ప్రసాద్

తాడేపల్లిరూరల్ : మూగ జీవాలను, ప్రకృతిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీజీఈ డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. శనివారం మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించిన మంగళగిరి ప్రాంతీయ పశు వైద్యశాలను గుంటూరు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహారావుతో కలసి ఆయన ప్రారంభించారు. పశు వైద్యశాలను రూ.3 లక్షలతో ఆధునీకరించిన మంగళగిరి రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ నరసింహారావు పశువైద్య శాల ఆవరణలో మొక్కలు నాటారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, ప్రాంతీయ పశువైద్యశాల వైద్యులు డాక్టర్ పివి శ్రీనివాసరావు, రొటేరియన్స్ అన్నే రత్న ప్రభాకర్, అనిల్ చక్రవర్తి, వి.శ్రీనివాసరావు, అందే మురళీకృష్ణ, ప్రగడ రాజశేఖర్, కాపరౌతు సుందరయ్య, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మూరు మైనర్‌బాబు, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



పశువైద్యశాలను ప్రారంభిస్తున్న డీజీఈ డాక్టర్ రాంప్రసాద్

మధ్యాహ్న భోజనం ప్రారంభించిన ఎమ్మెల్యే

మేడికొండూరు : సిరిపురం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థి దశ నుండే రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. కళాశాల ప్రిన్సిపల్ జి.బాలమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, మాజీ జెడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, సిరిపురం పార్టీ అధ్యక్షుడు మద్రిపూడి రాంబాబు, గఫూర్, గుడిపూడి శంకర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

నిర్ణీత వ్యవధిలో పారిశుద్ధ్య పనులు పూర్తి

ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్

తెనాలి: పారిశుద్ధ్య పనులు నిర్ణీత వ్యవధిలో కచ్చితంగా అమలుకావాల్సిందేనని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగరాదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ స్పష్టంచేశారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పథకంలో భాగంగా గత రెండురోజులుగా పట్టణ 35, 36 వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఛైర్‌పర్సన్ ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి శనివారం పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. వార్డు కౌన్సిలర్లు గొడవర్తి హరేరామ్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పట్టణ ప్రణాళిక అధికారి సాంబశివరావు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నజీర్, ఏఈ జానీబాషా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్

7,8,10 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్‌శాఖకు సంబంధించి అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్, రిటైల్ సప్లై టారిఫ్‌ల పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టనుందని తెనాలి విద్యుత్‌శాఖ ఈఈ వీవీ. చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంటలవరకు ముఖాముఖి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులు ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారని వివరించారు. అలానే 10వ తేదీన కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ముఖాముఖి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు. తమ అభిప్రాయాలను తెలియజేయాలనుకున్న వినియోగదారులు ముందుగా తమ పేర్లను www.aperc.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ తెనాలి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో జరుగుతుందన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మేడికొండూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరిముల్లా అధ్యక్షతన ప్రజా సంఘాలతో శనివారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై సభలో ప్రతిపాదనలు చేస్తూ, జిల్లా సమగ్ర అభివృద్ధి కృషి చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల కన్వీనర్ రామకృష్ణ బొట్ల ధనలక్ష్మి, గంగయ్య, సుజాత, ఎస్ఎం బాష, సాధిక్, వెంకటేశ్వర్లు, ఇమామ్, సుభాని పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుంటూరు రూరల్: ఇంటిముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన ప్రత్తిపాడు మండలం యనమదలలో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. యనమదల గ్రామం కొండ్రుపాడు డొంక వైపున ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం వెనుక ఉన్న ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు రాత్రి సమయంలో చోరీ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు ఇంటిముందు ఉంచిన వాహనాన్ని తీసుకెళ్లారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి ఇంటిలోని సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాల మేరకు దుండగులు ఎటువెళ్లారు, అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పంచాయతీ కార్మికుల పోరాటానికి మద్దతు



ఫిరంగిపురం: చేబ్రోలు పంచాయతీ కార్మికులను అక్రమంగా తొలగించడంపై ఫిరంగిపురం పంచాయతీ వర్కర్స్ యూనియన్ శనివారం నిరశన వ్యక్తం చేసింది. సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్ వలి మాట్లాడుతూ తొలగించిన కార్మికులను తిరిగి పనుల్లోకి తీసుకోవాలని చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. ఎటువంటి సమాచారం లేకుండా వారిని తొలగించడంపై నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామారావు, నాయకులు శ్రావణ్, బాలయ్య, ఇబ్రహీం, సతీష్, వెంకటేశ్వరమ్మ, సునీత, హనోక్, రామారావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



ఫిరంగిపురం: వేమవరం, కంద్రిక గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలకు సంబంధించి రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. సర్వేయర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, వీఆర్వో షేక్.సుభాని, మండవ నరసింహారావు, సీహెచ్ హనుమంతురావు, అప్పయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు టౌన్ ప్లానింగ్ బంపర్ ఆఫర్

తాడేపల్లిరూరల్: అభివృద్ధి చెందిన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నివాసితులకు ఇళ్ల నిర్మాణాల్లో ప్రభుత్వం వెసులు బాటు కల్పించిందని కమిషనర్ అలీం బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇంటి నిర్మాణానికి లే అవుట్ ప్రకారం రోడ్డు ఉంటేనే అనుమతులు ఇచ్చేవారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ నిబంధనను సవరించినట్లు తెలిపారు. పట్టణంలో ఇప్పుడున్న రోడ్ల వెడల్పు ప్రకారమే.. కొత్తగా ఆక్రమణలు లేకుండా ఇంటి నిర్మాణానికి అనుమతులిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అనుమతుల గురించి ఆయా సచివాలయాల్లో నోటీసులు ప్రదర్శనకు ఉంచామని, వాటిపై ఎలాంటి అభ్యంతరాలున్నా ప్రజలు సంబంధిత సచివాలయం లేదా కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ లోపు సూచనలు, సలహాలు అందజేయవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

పశు కిసాన్ క్రెడిట్‌కు 400 దరఖాస్తులు

ఫిరంగిపురం: పశు కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం 400కు పైగా రైతుల నుంచి దరఖాస్తులు అందాయని నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అన్నారు. వైద్యశాలలో శనివారం రైతులకు పశువులున్నాయని తెలిపే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులున్న వారు దాణా, పశు గ్రాసం కోసం బ్యాంకు ద్వారా రుణసదుపాయం పొందేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ఉన్నట్లు వెల్లడించారు. ఒక్కో పశువుకు సరాసరి రూ.30 వేల వరకు ఆరు పశువులకు రూ.1.60 లక్షల వరకు 7 శాతం వడ్డీతో రుణం అందజేస్తారని తెలిపారు. దానికోసం పశువులున్న రైతులు వైద్యాధికారి వద్ద పశు ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. బ్యాంకు ఖాతా ఉన్న రైతులు అప్లికేషన్లు అందజేయాలని సూచించారు. పంట రుణం ఉన్న వారు కూడా ఈ రుణం కోసం నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే 2024– 2025 సంవత్సరానికి సంబంధించి కొత్తగా నమోదైన వారు, రెన్యూవల్ అయిన 500 మంది రైతులకు దాణ కోసం రుణాలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఏడాదిలోగా నగదు చెల్లించిన వారికి మూడు శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని చెప్పారు.



రైతుకు పశు ధృవీకరణ పత్రం అందజేస్తున్న పశువైద్యాధికారి పీర్ అహ్మద్

మండల అభివృద్ధికి చర్యలు

మేడికొండూరు: మండల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న కోరారు. మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. గత సమావేశంలో అధికారులు తీసుకున్న అభివృద్ధి పనులు ఏ మేరకు పూర్తి చేశారనే అంశంపై సమీక్షించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని నూతన ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. తాగునీటి సమస్యలపై పలు శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో పనులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. ఎంపీడీఓ తోట చందన, కో–ఆప్షన్ మెంబర్ చంటి బాజీ, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సిద్ధయ్య, ఎంపీపీ స్వప్న

రోడ్ల మరమ్మతులు ప్రారంభం

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారిలో రోడ్ల మరమ్మతు పనులను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. తుళ్లూరు నుంచి బోరుపాలెం, లింగాయపాలెం నుంచి అబ్బరాజుపాలెం, సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి అనంతవరం, శాఖమూరు నుంచి ఐనవోలు వరకు తారు రోడ్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం రూ.2.46 కోట్లతో కొన్ని చోట్ల తాత్కాలికంగా, మరి కొన్ని చోట్ల నూతన రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావవణ్ కుమార్

ఉల్లాస్ పథకంపై అవగాహన

మేడికొండూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉల్లాస్ పథకం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో తోట చందన, ఏపీఎం విజయభారతి పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం, క్లిష్టమైన జీవన నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు, నిరంతర విద్యను అందించడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. వయోజన విద్య పర్యవేక్షకుడు చలపతిరావు ఆధ్వర్యంలో ది అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) పథకం సమావేశంలో భాగంగా పాఠ్య పుస్తకాలు, స్టడీ కిట్‌లు 54 మంది గైడ్‌లకు పంపిణీ చేశారు. ఒక్కో గ్రూప్ సభ్యులకు సంబంధించి టీచింగ్ మెటీరియల్, బోధనకు అవసరమైన కనీస సౌకర్యాల కోసం రూ. 400లు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉల్లాస్ పథకంపై బాధ్యతాయుతంగా పనిచేయాలని గ్రూప్ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

తాడేపల్లిరూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శనివారం ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న తన నివాసంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రి లోకేష్‌కు వినతి పత్రాలు అందజేశారు. శ్రీకాకుళం, విజయవాడ రాజరాజేశ్వరిపేట, ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వెంకటాపురం నుంచి వచ్చిన ప్రజలు మంత్రి నారా లోకేష్‌కు తమ సమస్యలు విన్నవించారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి అందరికీ అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.



వినతిపత్రం అందుకున్న మంత్రి లోకేష్